క్లుప్తంగా

14న జాబ్ మేళా

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 14న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర నాయుడు ఆదివారం తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 30 రోజుల పాటు శిక్షణ ఉద్యోగం కల్పిస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్, ఎదైనా డిగ్రీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన 19 నుంచి 25 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ సెల్ నంబర్‌కు 83283 98875ను సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా స్కూల్ వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: స్థానిక ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. స్కూల్ ఆవరణలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆట పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పట్టణంలో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.రాజమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సదస్యం



వేంకటేశ్వరస్వామి వారికి సదస్యం నిర్వహిస్తున్న అర్చకులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి సదస్యం నిర్వహించారు. తొలుత జీయర్ మఠాధిపతి పొడుగు ప్రసాదాచార్యులు, రమేష్, భాస్కరరావు, సాయి స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం స్వామి వారికి షికారు సేవ, సాయంత్రం సదస్యం, గ్రామోత్సవం నిర్వహించారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ

కిర్లంపూడి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి లక్ష తులసీదళపూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం హోమ సహిత లక్ష తులసిదళ పూజ, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గొరంపేటలో పారిశుధ్య డ్రైవ్



గొరంపేటలో జేసీబీతో వ్యర్థాల తొలగింపు

శంఖవరం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గొరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గొరంపేటలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సర్పంచ్ ఏసుబాబు సూచించారు.

కాకినాడ వెళ్లి పింఛన్ అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో బ్రహ్మానందం కుటుంబ సభ్యులకు పింఛన్ అందజేస్తున్న చంద్రిక

తుని: పట్టణానికి చెందిన గణాల బ్రహ్మానందం అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను పింఛను లబ్ధిదారుడు కావడంతో సచివాలయ వేల్ఫేర్ కార్యదర్శి చంద్రిక కాకినాడ వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసినట్టు పదో వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు మొల్లేటి గణేష్ తెలిపారు. విధి నిర్వహణలో మానవత్వం చాటిన చంద్రికను పలువురు అభినందించారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు



వెల్దుర్తి రోడ్డులో బీర్లమ్మతల్లి ఆలయం దాటాక ప్రమాదకరంగా ఉన్న మలుపు



సుద్దగెడ్డ వాగు దాటాక ప్రమాదాలు జరుగుతున్న మలుపు



నిత్యం ప్రమాదాలు జరుగుతున్న కోల్డ్ స్టోరేజ్ జంక్షన్

- ధర్మవరం-వెల్దుర్తి రోడ్డులో ప్రమాదకరంగా మలుపులు
- ఎదురెదురు వాహనాలు కనిపించని వైనం
- తరచూ ప్రమాదాలు

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాలను కలిపే ధర్మవరం-వెల్దుర్తి మీదుగా పిఠాపురం వెళ్లే ప్రధాన రహదారిలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. పలు ప్రాంతాల్లో ఎస్, ఎల్, యూ ఆకారంలో మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ధర్మవరం నుంచి పిఠాపురం వరకూ 14 కిలోమీటర్ల మేర వెల్దుర్తి, పి.తిమ్మాపురం, పి.రాయవరం పరిసర గ్రామాల ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం డబుల్ రోడ్డును వేసింది. రహదారి సౌకర్యవంతంగా ఉండటంతో కాకినాడ, పిఠాపురం, గొల్లప్రోలు తదితర ప్రాంతాలకు వెళ్లే వారు సైతం ఈ రహదారినే అత్యధికంగా వినియోగిస్తున్నారు. దీంతో రహదారి నిత్యం రద్దీగా దర్శనమిస్తుంది.

పలు ప్రాంతాల్లో..

ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ వద్ద నుంచి పిఠాపురం వరకూ రహదారి ఎంత సౌకర్యవంతంగా ఉందో రహదారి పొడవునా ఉన్న మలుపులు అంతే ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారిపై బీర్లమ్మతల్లి గుడి సమీపంలోనూ, సుద్దగెడ్డ వాగు వంతెన వద్ద, ఈ వంతెనకు దాటగానే కిలోమీటరు దూరంలోనూ, వెల్దుర్తి గ్రామం దాటాక ఎల్, ఎల్, యూ ఆకారంలో మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కలిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు

ఈ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోగా మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ రహదారిపై ఆదమరిచి ప్రయాణిస్తే మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదాల నిలయంగా కోల్డ్ స్టోరేజ్ జంక్షన్

ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ వద్ద హైవేపైకి వచ్చేటప్పుడు, హైవేను దాటేటప్పుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఎంతోమంది గాయపడ్డారు. ఫలితంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇటీవల ముగ్గురు యువకులు మోటారు సైకిల్‌పై కాకినాడ నుంచి ధర్మవరం వచ్చి వెళుతూ బీర్లమ్మతల్లి గుడి దాటిన తర్వాత ఉన్న మలుపులో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ప్రదేశంలో గతంలోనూ చాలా ప్రమాదాలు జరిగాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారిలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనాలు కనిపించడం లేదు



ధర్మవరం - వెల్దుర్తి రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దారి పొడవునా ఎస్, ఎల్, యూ ఆకారంలో మలుపులు ఉన్నాయి. ఎదురెదురు వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మలుపుల్లో ఇటీవల జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.
–దేవరపు మధు, వెల్దుర్తి, పిఠాపురం మండలం

ప్రమాదాల నివారణకు చర్యలు



ధర్మవరం – వెల్దుర్తి రోడ్డులో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు జరిగే ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రమాదాల నివారణకు ధర్మవరంలో కోల్డ్ స్టోరేజ్ వద్ద హైవే జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశాం. అవసరం మేరకు మరిన్ని చర్యలు తీసుకుంటాం.
– ఎం.పవన్‌కుమార్, ఎస్సై, ప్రత్తిపాడు

శాశ్వత భూహక్కుతో రైతులకు ప్రయోజనం

రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా



ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో డ్రోన్‌ను ప్రారంభించిన మంత్రి దాడిశెట్టి రాజా

తుని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం డ్రోన్ సాయంతో చేసే సమగ్ర భూ సర్వేను మంత్రి రాజా ప్రారంభించారు. ఈ సర్వేతో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నియోజకవర్గం పరిధిలోని మూడు మండలాల్లోనూ డ్రోన్ ద్వారా రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

వలంటీర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వలంటీర్ చేపల సత్య కుటుంబానికి మంత్రి రాజా ఆర్థిక సాయం అందజేశారు. తొండంగి మండలం కొత్త చోడిపల్లిపేట గ్రామానికి చెందిన సత్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ విషయాన్ని నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి రాజా తన క్యాంపు కార్యాలయంలో తన సొంత నిధుల నుంచి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొయ్యా మురళీ, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పేరూరి బద్రినారాయణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారులకు సమస్యలు నివేదిస్తాం



వాహన యజమానులు, అధికారులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత అలమండ చలమయ్య

ఏలేశ్వరం: ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ చేస్తున్న వాహన (ఎండీయూ)యజమానుల సమస్యలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని మండల సప్లయి అధికారి ఇస్మాయిల్ అన్నారు. రేషన్ పంపిణీ వాహనాల ఇన్సూరెన్సు తమ వేతనాల్లో కట్ చేస్తున్నారని ఎండీయూ నిర్వాహకులు వాహనాలను నిలిపి వేశారు. దీంతో మండల వ్యాప్తంగా శనివారం రేషన్ సరకులు సరాఫరా నిలిచిపోయింది. దీంతో వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య వాహనదారులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిపై చలమయ్య మాట్లాడుతూ వేతనం కట్ చేసిన ఒక్కరోజులోనే వాహనాలు నిలిపివేస్తే లబ్ధిదారులు ఇబ్బందులు పడతారన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఓను కోరారు. దీనిపై ఎంఎస్ఓ హామీ ఇవ్వడంతో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు వాహనయజమానులు అంగీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొండలరావు, వీఆర్వో మణికంఠ, వాహనయజమానులు పాల్గొన్నారు.

175 మందికి గుండె వైద్య పరీక్షలు



తునిలో రోగులకు గుండె వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

తుని: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన ఉషా కార్డియాలజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు ప్రారంభించారు. కార్డియాలజీ డాక్టర్ శ్రీనివాస్ తుని పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 175 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా వైస్ చైర్మన్ నార్ల రత్నాజీ తెలిపారు. 40 ఏళ్ల దాటిన అందరూ క్రమం తప్పకుండా వ్యాయామం పాటు వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, నాయకులు చిక్కాల సీతారాం, బుద్ధిగ దారేష్, కన్నూరి శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో అడుగంటుతున్న జలాలు



లోవకొత్తూరు చెరువులో అడుగంటిన జలాలు

తుని రూరల్: వేసవి కాలం ప్రారంభం కావడంతో చెరువుల్లో జలాలు అడుగంటుతున్నాయి. మెట్ట ప్రాంతమైన తుని మండలంలో పశువులకు తాగునీరు, వ్యవసాయానికి అవసరమైన సాగునీటికి చెరువులే ఆధారం. తుని మండలంలోని 23 పంచాయతీల పరిధిలో 75 సాగు, తాగునీటి చెరువులు ఉన్నాయి. డి.పోలవరం, ఎన్ఎస్‌వీ నగరం, ఎస్.సూరవరం, అటికివానిపాలెం, కేఓ మల్లవరం, రాపాక, దొండవాక, కుమ్మరిలోవ, కొలిమేరు, రేఖవానిపాలెం, తాళ్లూరు, వి.కొత్తూరు, రాజుపేట, లోవకొత్తూరు, చేపూరు తదితర గ్రామాలకు నీటి వసతులు లేవు. వర్షాధారంగా చెరువులు నిండితే ఆ జలాలనే సాగుకు, పశువుల తాగునీరుగా వినియోగిస్తున్నారు. ఇప్పటికే ఆయా చెరువుల్లో జలాలు అడుగంటిపోయాయి. మరో రెండు వారాల వరకూ పశువులకు తాగునీరు లభించే అవకాశం ఉంది. ఆ తర్వాత పూర్తిగా బోరుబావులపైనే ఆధారపడాల్సి ఉంటుంది. పుష్కర ఎత్తిపోతల నుంచి సాగునీరు అందే టి.తిమ్మాపురం, హంసవరం, ఎస్.అన్నవరం, చామవరం, హెచ్.కొత్తూరు, అగ్రహారం గ్రామాల పరిధి చెరువుల్లో జలాలు ఉండడంతో రైతులకు కొంతమేరకు ఊరట లభించనుంది.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎంపీపీ శ్రీవల్లి, శివ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

గోకవరం: గ్రామంలో అరుదైన సీజీడీ వ్యాధితో బాధపడుతున్న రెండున్నరేళ్ల బాలుడు సత్యశ్రీఅక్షయ్‌రామ్ వైద్యానికి శివ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. బాలుడి వైద్యానికి రూ.30 లక్షల వరకూ ఖర్చవుతుందని తెలుసుకున్న అసోసియేషన్ సభ్యులు రూ.30 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆదివారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు చేతుల మీదుగా బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాలుడి వైద్యానికి సహకారం అందించిన శివ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను ఎంపీపీ దంపతులు అభినందించారు. దాతలు ముందుకొచ్చి బాలుడి వైద్యానికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎస్ఎస్ అలీషా, వాకచర్ల రవి, కట్టా సూర్యప్రకాష్ రావు, రామోజు దుర్గ, అద్దంకి వెంకటేశ్వరరావు, వంకా వీరబాబు, మైపాల సతీష్ నాగులకొండ భద్రరావు, బత్తుల రాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

పెద్దాపురం డీఎస్పీ మురళీ మోహన్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మురళీ మోహన్

గండేపల్లి: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీ మోహన్ సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుతూ రామేశంపేట, సూరంపాలెం గ్రామాల్లోని 19 హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు అష్టకష్టాలు పడి పిల్లలను చదివిస్తుంటే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని సూచించారు. కాకినాడ జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్ బాబు ఆదేశాల మేరకు జిల్లాలోని విద్యార్థులు మెరుగైన జీవితాన్ని అవలంబించేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కళాశాలల వద్ద గాని, బయట గాని అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే పెద్దాపురం డీఎస్పీ 94907, 60768, జగ్గంపేట సీఐ 94407 96529, గండేపల్లి ఎస్సై 94409 04841 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు, గండేపల్లి ఎస్సై గణేష్ కుమార్, జగ్గంపేట ఎస్సై సీహెచ్ విద్యాసాగర్, కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు, పెద్దాపురం ఎస్సై ఎస్‌కే అబ్దుల్ నబీ పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



అవల్దార్‌పాడులో కాలిపోతున్న పూరిగుడిసె

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ అవల్దార్‌పాడులో ఆదివారం తాటాకిల్లు (పూరిల్లు) దగ్ధమైంది. గ్రామానికి చెందిన కొంజెర్ల సత్యవతి, లోవదుర్గ కుటుంబాలు పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాయి. ఆదివారం సాయంత్రం ఇంటి పైకప్పు నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు పెద్ద ఎత్తున చేరుకుని నీటి బిందెలతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. తుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చే లోపు ఈదురగాలులకు మంటలు చెలరేగి గుడిసెలు పూర్తిగా కాలిపోయియి. ఈ ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన గృహోపకరణాలతో ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న నగదు, నగలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బాధితులకు తక్షణమే తాత్కాలిక వసతి, నిత్యావసర వస్తువులు అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.

చెందుర్తిలో రెండు వర్గాల మధ్య వివాదం

- పెద్ద చెరువు విషయంలో గొడవ
- పోలీసులు, రెవెన్యూ అధికారుల జోక్యంతో సద్దుమణిగిన ఉద్రిక్తత



ఇరు వర్గాలతో మాట్లాడుతున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఉన్న పెద్ద చెరువుపై తమకు హక్కు ఉందని రెండు వర్గాలు వివాదానికి దిగడంతో ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసు, రెవెన్యూ అధికారులు చెరువు వద్దకు వెళ్లి ఇరు వర్గాలను నిలువరించారు. వివరాల్లోకి వెళితే.. చెందుర్తి సర్వే నంబర్ 234లో 92 ఎకరాల వ్యవసాయ చెరువు ఉంది. ఈ చెరువుపై ఆధారపడి సుమారు 500 ఎకరాల్లో రైతులు పంటలు పండించుకుంటున్నారు. దీనిలో చెందుర్తి, కొడవలి గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు మత్స్యకార సొసైటీగా ఏర్పడి చేపలు పెంచుకుని అమ్ముకుంటున్నారు. కాగా శనివారం ఆ మత్స్యకార సంఘం సభ్యులు చెరువులో చేపలు పట్టుకునేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన మరో వర్గం వ్యక్తులు ఆ చెరువుపై తమకు హక్కు ఉందని గొడవకు దిగారు. దీంతో ఆదివారం ఉదయం ఇరు వర్గాలు చెరువు వద్దకు చేరుకుని చేపలు పట్టుకునే విషయంలో వివాదానికి దిగారు. ఇరు వర్గాల వారు వేర్వేరుగా టెంట్‌లు ఏర్పాటు చేసుకుని ఒకరిపై ఒకరు పంతాలకు పోయి దాడులకు తెగబడడానికి సిద్ధమయ్యారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో చెరువు వద్దకు చేరుకున్నారు. ఇరువర్గాల వాదనలు విన్న తరువాత స్థానిక మత్స్యశాఖాధికారి రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడి అసలు చెరువుపై ఎవరికి హక్కు ఉందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అయితే పాత సంఘం గత రెండేళ్లగా రెన్యువల్ చేయించుకోలేదని మత్స్యశాఖాధికారి చెప్పడంతో విషయం తేలే వరకూ ఏ వర్గ సభ్యులు చెరువు వద్దకు రావడానికి వీలు లేదని హుకుం జారీ చేశారు. అప్పటివరకూ పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బందితో కాపలా కాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఇరు వర్గాలు అక్కడి నుంచి వెళ్లి పోయారు. రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల వేలంపాటలు పెండింగ్‌లో ఉన్నాయని మత్స్యశాఖాధికారి రామకృష్ణ తెలిపారు. అధికారుల నిర్ణయంతో వివాదం సద్దుమణిగింది.

విజిలెన్స్ తనిఖీలు

ఏలేశ్వరం: నియోజకవర్గంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లోని ధర్మవరం, యర్రవరం గ్రామాల్లో చికెన్, మటన్, చేపల దుకాణాలపై ఆదివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు చేశారు. రీజినల్ విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ పీవీ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని ఆరు షాపుల్లో తనిఖీలు చేయగా ఒక షాపులో కేజీకి వంద గ్రాములు తూకం తేడా రాగా రెండు షాపుల్లో ఎలక్ట్రానిక్ కాటాలకు స్టాంపింగ్ లేకపోవడం గుర్తించి మూడు షాపులపై కేసులు నమోదు చేశారు. యర్రవరంలో నాలుగు షాపుల్లో తనిఖీలు చేయగా రెండుషాపుల్లో ఎలక్ట్రానిక్ కాటాలకు స్టాంపింగ్ లేకపోవడం గుర్తించి రెండు షాపులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, కానిస్టేబుల్స్ ఈశ్వరరావు, లోవకుమార్ పాల్గొన్నారు.

చెరువులో మట్టి తవ్వకాల అడ్డగింత

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున ఉన్న రాజుచెరువులో మట్టి తవ్వకాలను టీడీపీ నాయకులు ఆదివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గునిపే భరత్ మాట్లాడుతూ చెరువులో మట్టిని అక్రమంగా లే అవుట్‌లు, ఇటుక బట్టీలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

దుకాణాలు మూసివేత

రౌతులపూడి: టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ వరుపుల రాజా మృతికి సంతాపంగా రౌతులపూడిలో వ్యాపారులు ఆదివారం స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. వరుపుల రాజా భౌతిక కాయాన్ని సందర్శించేందుకు మండలం నుంచి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రత్తిపాడు తరలివెళ్లారు. పలువురు టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు రాజా మృతికి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదస్థలంలో డివైడర్‌పై కారు

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని మల్లేపల్లి శివారు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, హైవే మెయింటినెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు వెళుతున్న కారు మండలంలోని మల్లేపల్లి శివారు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఎస్‌కే నాగూర్, షేక్ రఫీలు గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే మెయింటినెన్స్ సిబ్బంది కారు నుంచి బయటకు తీసి హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంతకు ముందు గండేపల్లి శివారు రాయిచెరువు సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన ప్రమాదం వల్ల విశాఖ వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు.

9 నుంచి డ్వామా అధికారులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈనెల 9వ తేదీ నుంచి తొమ్మిది జిల్లాలోని డ్వామా అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఈటీసీ మేనేజరు పి.శ్రీనివాసు తెలిపారు. ఆదివారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పు, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పట్నం జిల్లాలోని డ్వామా ఏపీడీ ఏపీఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తామన్నారు. తొమ్మిది జిల్లాలో 352 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉండగా 79 మందికి శిక్షణ మొదటి బ్యాచ్‌లో పూర్తయిందని తెలిపారు. 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రెండో బ్యాచ్, 13 నుంచి 15వ తేదీ వరకూ మూడో బ్యాచ్, 16 నుంచి 18వ తేదీ వరకు నాలుగో బ్యాచ్‌కు శిక్షణ ఇస్తామన్నారు.శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు.

పురుహూతికా అమ్మవారికి బంగారు నెక్లెస్ సమర్పణ

పిఠాపురం: అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠమైన పిఠాపురం పురుహూతికా అమ్మవారికి భక్తులు బంగారు నెక్లెస్‌ను ఆదివారం సమర్పించారు. పిఠాపురానికి చెందిన దంగేటి నాగేశ్వరరావు, మహాలక్ష్మి దంపతులు రూ.50 వేల విలువైన 10.550 గ్రాముల బంగారు నెక్లెస్‌ను ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు. ఆలయ ఈఓ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నెక్లెస్‌ను అలంకరించారు. పలువులు ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, KHATUN JANI, W/o. MOHAMMED YUSUF JANI, R/O. Flat No.503, Tower-A, Chitturi Metro Apartment, Near D-Mart, Tuni, Kakinada District, A.P., have changed my Name from VAFA PAIKARI KHATOON (Old Name) to KHATUN JANI (New Name). Hence here After all documents & correspondence will be continue with My New Name KHATUN JANI vide Affidavit Dt.05-03-2023.